# సత్యంవధ

- విశ్వనాథ గణపతిరావు -



**గేటుకు** అడ్వకేట్ ఎస్. భరత్ కుమార్ అన్న బోర్డు చూసి టక్కున ఆ నీలంరంగు మేడ ముందు ఆగాడు అచ్చారావు. గేటు తీసుకుని లోపలికి వెళ్ళి బజర్ ప్రయోగించాడు. ఒక్క నిముషం తరవాత డోర్ తెరుచుకుంది. లేత నీలం రంగు నైట్ గౌన్ వేసుకున్న ఆమె వచ్చి ''ఎవరు కావాలండి?'' అని అడిగింది.

ఆమె భరత్ కుమార్ భార్య సత్యవతి. నిండయిన విగ్రహం ఆమెది. అటువంటి ఆమెకు ఆ నైట్ గౌన్ ఎబ్బెట్టుగా ఉందనిపిస్తుంది. నుదుట అర్ధ రూపాయి కాసంత బొట్టు ఉంటే ముగురమ్మల మూలపుటమ్మలా, తెలుగు తల్లిలా ఉండేది. కానీ ఆ నుదుట బొట్టు నాగరికత పేరుతో చిక్కి శల్య మయి సన్నని రేఖలా మిగిలిపోయింది. కాటుక రేఖలు లేని కళ్ళు గాజు కళ్ళలా ఉన్నాయి. ఆ కళ్ళు 'ఎవరు కావాలి?' అన్నట్టు అచ్చారావు వైపు చూస్తున్నాయి.

''లాయర్ గారి గురించి వచ్చానండీ!''

''రండి. ఇలా కూర్చోండి. టిఫిన్ చేస్తున్నారు, వస్తారు'' అని వరండాలో కుర్చీ చూపించి ఆమె లోపలికి వెళ్ళిపోయింది.

అయిదు నిముషాల్లో ఆయన వచ్చారు.

గబుక్కున కుర్చీలోనుండి లేచి, ''నమస్తే, సార్'' అన్నాడు అచ్చారావు.

''కూర్చోండి! ఎవరు మీరు?'' కోటు సర్దుకుని, తను మరో కుర్చీలో కూర్చుంటూ అడిగాడు.

''నా పేరు అచ్చారావండి. మీతో మాట్లాడ్డానికి వచ్చాను'' అన్నాడు.

అచ్చారావుని, ఒక్కసారి క్రింద నుండి మీద వరకూ చూశాడు భరత్ కుమార్—ఇది ఖూనీకేసా లేక విడాకుల కేసా?' అని.

సాధారణంగా భరత్ కుమార్ దగ్గరికి ఆ రెండు కేసులకు సంబంధించిన వాళ్ళుమాత్రమే వస్తుంటారు. అవి తప్ప వేరే కేసులైతే ఈయన టేకప్ చేయడం కూడా సాధారణంగా ఉండదు. ఇంతకూ అచ్చారావుది ఏ కేసు? అని వూహించేలోగా! ...

''నాకూ, నా భార్యకూ విడాకులు ఇప్పించాలండి'' అన్నాడు అచ్చారావు.

రెండో కేసన్న మాట!?

'అయినా ఎంత ధైర్యం, నాలాంటి ఎడ్వకేట్ దగ్గరికి రావడానికి? తెలిసే వచ్చాడా? లేక తెలియక ఎవరో ఒకరి దగ్గరికి వెళ్ళాలన్న తలంపుతో వచ్చాడా!' అడిగేస్తే సరిపోతుంది.

''అచ్చారావుగారూ, మీరు నా గురించి...ఐ మీన్ నాతో కేసు గురించి డీల్ చేయాలంటే చాలా ఎక్కువ ఖర్చవుతుంది. ఆ విషయం మీకు ...''

''తెలుసండి! అంతేకాదు. మీ రే కేసు టేకప్ చేసినా వోటమి అన్నది ఉండదని కూడా తెలుసు! ఎంత డబ్బు ఖర్చయినా ఫరవాలేదు. నా కేసు మీరు తీసుకుంటానంటే చాలు ...'' అంటూ అతని ముఖంలోకి ఆశగా చూశాడు.

అచ్చారావు ఇప్పుడు బంగారు బాతులా కనిపిస్తున్నాడు భరత్ కుమార్ కళ్ళకి.

''వో కే. తప్పకుండా మీ కేసు టేకప్ చేస్తాను...కేసు వివరాలు చెప్పండి!'' అంటూ కుర్చీలో వెనకకి చేరబడ్డాడు.

''నా భార్య చాలా ఆస్తిపరురాలు—నన్ను నమ్మి తన ఆస్తి నంతా నా పేరున ట్రాన్స్ఫర్ చేసింది. నమ్మిన వాళ్ళను మోసం చెయ్యడం చాలా ఈజీ కదండీ? అందుకే దాన్ని వదిలేయా లనుకుంటున్నాను.''

భరత్ కుమార్ ఒక్కసారి కనుబొమ్మలు పైకి ఎగురవేశాడు.

''మీ కేసులో బొత్తిగా న్యాయం లేదండీ. హండ్రడ్ పర్సెంటూ అన్యాయమే! ...'' అన్నాడు.

అచ్చారావు చిన్నగా నవ్వాడు.

''ఏమాత్రం న్యాయమున్నా మీలాంటి లాయర్ దగ్గరికి వెతుక్కుంటూ రావడ మెందుకండీ? ఏ చెట్టు కిందికి పోయినా గబ్బిలాల్లా అంటిపెట్టుకుని వందల మంది ఉన్నారు.''

భరత్‌కుమార్ మనస్సు చివుక్కుమంది, లాయర్లను బొత్తిగా గబ్బిలాలతో పోల్చేసరికి! ఇబ్బందిగా చిన్న నవ్వు నవ్వి, ''నిజమేననుకోండి! కానీ ...''

ఫీజు పెంచడానికి లాయర్‌గారు పడుతున్న ఇబ్బందికి మనసులోనే చిన్నగా నవ్వుకున్నాడు అచ్చారావు.

''మీ కిందాకనే చెప్పాను, సార్! ఫీజు ఎంతయినా పరవా లేదు—కేసు తీసుకోమని.'' సూటిగా చెప్పేశాడు.

''అబ్బే! మీరు ఫీజు ఇవ్వరని కాదు!'' కాస్త తడబడుతూ అన్నాడు భరత్‌కుమార్.

అచ్చారావు లేచి నిలుచున్నాడు. పాంటుజేబులో నుండి డబ్బు తీసి ఇస్తూ, ''ఇది అడ్వాన్సుగా ఉంచండి!'' అన్నాడు.

బేరాలు జరిగిపోయాయి.

సలహాలు చెప్పబడ్డాయి.

సాక్షులు బుక్ చేయబడ్డాయి.

''రేపు నువ్వు కోర్టు దగ్గర నన్నొకసారి కలిసి, అది నాకు అందించాలి'' అన్నాడు భరత్‌కుమార్.

"అలాగే, సార్!" అంటూ వెళ్ళిపోయాడు అప్పారావు, లాయర్ ఇచ్చిన తెల్లకాగితం తీసుకుని.

● ● ● ●

తెల్లకాగితం తీసుకొచ్చి, కోర్టు ప్రహరీ గోడ దాటి లోపలికి వెళుతున్న భరత్‌కుమార్ చేతి కిచ్చాడు అప్పారావు. దానిమీద సంతకం చూసి ఆశ్చర్యంగా కళ్ళింతింతవి చేసుకుని అప్పారావు వైపు చూసి, "వెరీగుడ్! నీవు అసాధ్యుడివోయ్! భార్యచేత సునాయాసంగా సంతకం చేయించేశావ్!... ఇంతకూ ఈ విషయం మీ ఆవిడకు తెలియదు కదా?" తగ్గుస్వరంతో అటూ ఇటూ చూస్తూ అన్నాడు.

"తెలియదు, సార్!"

"తెలుస్తుంది, రేపు కోర్టు నోటీసు అందిన తరవాత! ...

"థాంక్స్, సార్!" అన్నాడు అప్పారావు.

"సరే, నీ వింక వెళ్ళిపోవచ్చు!"

భరత్‌కుమార్‌కి నమస్కరించి వెళ్ళిపోయాడు అప్పారావు.

కోర్టు ఆవరణ అంతా హడావిడిగా ఉంది. చెట్ల క్రింద, రోడ్డుప్రక్క, కోర్టు బిల్డింగు వరండాల మీద గుంపులు, గుంపులుగా క్లయింట్స్, వాళ్ళతో వచ్చిన సాక్షులు కూర్చుని ఉన్నారు. కొంతమంది కోర్టు చుట్టూ ఉన్న ప్రహరీగోడ మీద కూడా కూర్చుని ఉన్నారు.

ప్రహరీ గోడ కానుకుని ఉన్న కిళ్ళీ బడ్డీ ముందు నిలుచుని ఎవరో క్లయింట్‌తో మాట్లాడుతున్న లాయర్ మధుసూదనరావు భరత్ కుమార్ అప్పారావుతో మాట్లాడినంతసేపూ చూసి అప్పారావు వెళ్ళిపోగానే, తన క్లయింట్‌ని అక్కడే ఉండమని చెప్పి అటు కదిలాడు.

"హలో! కుమార్" అంటూ పిలిచాడు.

మెట్లు ఎక్కబోతున్న భరత్‌కుమార్ వెను తిరిగి చూశాడు.

"హలో! వాట్ మధూ! వారం రోజుల నుండి కనిపించడమే మానేశావ్?" అంటూ దగ్గరికి వచ్చిన మధు చేతిలో చేయి కలిపాడు.

"మేరేజికి విజయవాడ వెళ్ళాను ... సరేగాని, ఆ క్లయింట్ నీ దగ్గరికి ఎందుకొచ్చాడు?"

రోడ్డు మీద నుండి నడిచి వెళ్ళిపోతున్న అప్పారావుని చూపిస్తూ అడిగాడు మధుసూదనరావు.


"కేసు విషయంలో మాట్లాడడానికి వచ్చాడు."

"మర్డర్ కేసా? ..."

"నో! ..." ఆశ్చర్యంగా చూశాడు మధుసూదనరావు వైపు. "అతను మీకు తెలుసా? లేక నా దగ్గరికి అటువంటి కేసులు మాత్రమే వస్తాయన్న ఉద్దేశ్యంతో అంటున్నారా ..."

"నో! నో! అటువంటి ఉద్దేశంతో అనడంలేదు. అతని గురించి చెబుతాను ఇలా రండి" అంటూ వెనుతిరిగి నడిచాడు మధుసూదనరావు. అతడ్ని అనుసరించాడు భరత్‌కుమార్.

ఇద్దరూ ప్రహరీ గోడ కానుకుని ఉన్న కిళ్ళీబడ్డీ దగ్గరకు వచ్చి నిలుచున్నారు. అక్కడ నిలుచుని ఉన్న మధుసూదనరావు క్లయింట్స్, భరత్ కుమార్‌కి నమస్కరించి, కాస్త పక్కకి వెళ్ళి వినయంగా




నిలుచున్నారు. భరత్‌కుమార్ పాంటు జేబులోనుండి సిగరెట్ పాకెట్ తీసి మధుకి ఆఫర్‌చేశాడు. ఇద్దరూ సిగరెట్లు వెలిగించారు.

"ఊఁ! చెప్పండి" అన్నాడు భరత్‌కుమార్ సిగరెట్ దమ్ము లాగి వదులుతూ!

చేతిలో అగ్గిపుల్ల ఆర్పేసి గోడ మూలకు విసిరేస్తూ, "అతను మూడు సంవత్సరాల క్రితం నా క్లయింట్. తన భార్య ఆత్మహత్య చేసుకుందని, కానీ ఆమె తల్లితండ్రులు తనే హత్యచేశానని కేసుపెట్టారని చెప్పాడు. ఆ కేసు నేను టేకప్ చేశాను. 'అది హత్య కాదు—ఆత్మహత్య' అని రుజువయింది. ఆ మరుసటి రోజు చాలా ఆనందంతో నా దగ్గరికి వచ్చి, నాకు ఇవ్వవలసిన ఫీజుకన్నా డబుల్ ఫీజు ఇచ్చి వెళ్ళాడు. నాకు వెంటనే అనుమానం వచ్చింది. ఎంక్వైరీ చేసి చూశాను. వాళ్ళ ఇరుగు పొరుగువాళ్ళు చెప్పిన సమాచారం బట్టి ఇది హత్యేనని నా కనిపించింది. నా అనుమానానికి మరో ఆధారం—వారం తిరక్కుండా అతను మరో పెళ్ళి చేసుకోవడం. కనుక ఆ రాస్కల్ ఇంకెటువంటి కేసు నీ దగ్గరికి తీసుకొచ్చినా టేకప్ చెయ్యకు!" అని చెప్పి భరత్ కుమార్ ముఖంలోకి చూశాడు.

భరత్‌కుమార్ ఏదో ఆలోచిస్తున్నట్లుగా అనిపించింది మధుసూదనరావుకి.

"ఇంతకూ అతను తీసుకొచ్చిన కేసేమిటి?" అని తనే మళ్ళీ అడిగాడు.

"విడాకుల కేసు..."

"నో! టేకప్ చెయ్యొద్దు ..."

"చూడు, మధూ! మనం ఉన్నది క్లయింట్ల తరఫున వాదించడానికే! నీలా ఎంక్వైరీలు చేసి వచ్చిన కేసునల్లా వదిలేస్తే, ఆ క్లయింట్ చెప్పినట్టు ఏ చెట్టు క్రిందకో గబ్బిలంలా చేరిపోవలసి ఉంటుంది" అంటూ ఇబ్బంది కలిగించే చిన్న నవ్వు నవ్వాడు.

ఆ మాట వినగానే మధుసూదనరావు చిన్నబోయాడు. నోట మాట రాలేదు. అది గ్రహించాడు భరత్ కుమార్. అందుకే అన్నాడు:

"నేను ఆల్‌రెడీ ఆ కేసు టేకప్ చేసేశాను. అడ్వాన్సు కూడా పుచ్చుకున్నాను. ఇప్పుడు నేను కాదన్నా, అతను మరో లాయర్ని పట్టుకుని భార్యకి విడాకు లిప్పించగలడు. ఎందుకంటే, అతని దగ్గర కావలసిన ఆధారాలు ఉన్నాయి. అందుకని కేసు విడిచిపెట్టడం నాకు ఇష్టం లేదు. విడిచిపెడితే అనవసరంగా డబుల్ ఫీజు వదులుకున్న వాడి నవుతాను. మీ మాట కాదంటున్నందుకు సారీ! ... అన్నట్టు మర్చిపోయాను. ఈ రోజు మా ఇంటిలో డిన్నర్ ఉంది. మీరు తప్పకుండా రావాలి. టు డే ఈజ మై మేరేజ్ డే! ... వస్తానండి! ఈవినింగ్ మర్చిపోకండి" అంటూ వెళ్ళిపోయాడు భరత్‌కుమార్.

మధుసూదనరావు చేతిలోనుండి అప్పటికే జారి క్రింద పడిపోయి కాలుతున్న సిగరెట్టుని కాలితో ముట్టుకుంటూ! ...

"పరదేశీయుల దాస్య శృంఖలాల నుండి సమతా మార్గంలో తెంచుకు వచ్చిన భరతమాతా, నీ బిడ్డల దాంపత్య జీవితాలను ఇంత ఘోరంగా, అక్రమ మార్గంలో తెంచేస్తున్న భరత్‌కుమార్‌లను కన్నావేమమ్మా!" అని అనుకున్నాడు.

● ● ● ●

రాత్రి ఏడున్నర కావస్తున్నది.

బజర్ మ్రోగితే ఎవరో తలుపు తీశారు. ఏవో మాటలు, చంటిపిల్ల ఏడుపు వినిపించాయి.

ఈజీచైర్లో కూర్చుని ఏదో పుస్తకం చదువుతున్న భరత్‌కుమార్ వెనుతిరిగి చూశాడు.

ఆమె! ...

ఆమె చేతులలో ఓ చంటిపిల్ల! ... ఆమె ఎవరో?

ఆమె కేదో సమాధానం చెప్పి, కిచెన్ రూములోకి వెళ్ళిపోయింది తలుపు తియ్యడానికి వచ్చిన సత్యవతి.

ఆమె భరత్‌కుమార్‌కి నమస్కరించింది, చేతిలో ఉన్న చంటిపిల్ల జారిపోకుండా జాగ్రత్తపడుతూ —

"ఏం కావాలి?" అన్నట్టు చూశాడు, ఆమెవైపు భరత్‌కుమార్.

ఆమె ముఖం మ్లానమై ఉంది. కళ్ళలో నీళ్ళు సుళ్ళు తిరుగుతూనే ఉన్నాయి. చీర కొంగుతో కళ్ళువత్తుకుంది. ఆ కొంగు చివర ముడి ఉంది. అది బ్రహ్మ ముడి కాదు. ఆ ముడిలో బ్రహ్మరాతనే మార్చేసే కాగితం ఉంది.

ఆ కాగితమే! ...

కోర్టు నోటీస్! ...

ఆ నోటీస్ బయటకు తీయాలని ముడివిప్పింది విప్పి చూపిస్తూ అంది:

"నా పేరు పార్వతి. మీరు నా పేరున పంపిన నోటీస్ ఇది ..."

"నీవు అచ్చారావు భార్యవా?"

"అవునండి!" ఆమె గొంతు ఆర్ద్రమయింది. అది గ్రహించాడు భరత్‌కుమార్. ప్రక్కకి మొహం తిప్పుకున్నాడు.

"ఆ నోటీసు తీసుకుని రావలసింది కోర్టుకి—ఇక్కడికి కాదు" అన్నాడు.

ఆమె ఒక్క క్షణం ఆశ్చర్యపోయింది. తేరుకుని అంది:

"నిజమేనండి. కానీ ఇది అన్యాయమని మీతో చెప్పుకుందామని వచ్చాను."

"ఏం చెప్పాలన్నా కోర్టులోనే చెప్పాలి. ఇలా ఇంటి దగ్గర కాదు ..."

"మీరు నా భర్త దగ్గర అడ్వాన్సు కోర్టులోనే తీసుకున్నారా? నాతో కాగితం మీద సంతకం చేయించమని కోర్టులోనే చెప్పారా?"

దీనంగా మాట్లాడిన ఆమె ఒక్కసారిగా ఆవేశంతో మాట్లాడేసరికి ఈసారి ఆశ్చర్యపోవడం భరత్ కుమార్ వంతయింది.

"ఇంత తెలివిగా మాట్లాడుతున్న దానివి కాగితం మీద సంతకం ఎలా పెట్టావ్?" అని అడిగాడు.

"అంటే ... ఆ సలహా ఇచ్చింది మీరేనన్న మాట ... కనురెప్పలు కాటేస్తాయని ఎవరైనా అనుకోగలరా? ఏదో బ్యాంకు అవసరమని ఆ తెల్ల కాగితం మీద నా చేత సంతకం చేయించారు. విడాకులకి నాకు నేనుగా ఒప్పుకుంటున్నట్టుగా తర వాత నింపారు. లాయరుగారూ! నే నిక్కడకు వచ్చింది నన్ను రక్షించమని వేడుకోవాలని వచ్చాను. కానీ మిమ్మల్ని చూశాక, మీ మాటలు విన్నాక మర్యాద ఇవ్వడం కూడా అనవసరం అనిపిస్తోంది నాకు. తెలివి తేటలు సంపాదించుకోవడం ఇందు కోసమే అయితే, మీ లాంటి భరత్‌కుమార్‌లు ఈ భరత భూమికి పాపాల బరువు ..." అంటూ కోపంతో భరత్ కుమార్ వైపు చూసి వడివడిగా అడుగులు వేసుకుంటూ అక్కడ ఉండడం, అతనితో మాట్లాడ్డం ఇక అనవసరమని వెళ్ళిపోయింది, చంటి పిల్లను చంకను వేసుకుని ...

ఆమె మాటలు చెళ్ళున కొట్టిన కొరడాదెబ్బలా తగిలింది భరత్‌కుమార్‌కి. కోపం కట్టలు తెంచు కుంది. పౌరుషంగా ముక్కుపుటాలు ఎగురవేశాడు.

"బరితెగించిన ఆడది. అందుకే మర్యాద లేకుండా మాట్లాడుతోంది" అని అనుకున్నాడు.

"ఏమండీ!"

తలఎత్తి చూశాడు భరత్‌కుమార్. ఎదురుగా జేవురించిన ముఖంతో నిలుచుని ఉంది సత్యవతి.

"భోజనం పెట్టేయమంటారా?"

"నాకు ఆకలిగా లేదు. తరవాత తింటాను."

"ఎలా ఉంటుంది? ఆమె అన్న మాటలతో కడుపు నిండిపోయి ఉంటుంది." హేళనగా అంది.

"సత్యా!" ఆశ్చర్యంతో అన్నాడు భరత్‌కుమార్.

"కాకపోతే ఏమిటండీ ... పాపిష్ఠి డబ్బుకోసం పచ్చని జీవితాలను ఎడారిమయం చేస్తారా?" భర్తను ఎదిరించి ఏ నాడూ ఇలా మాట్లాడక పోయినా, ఈ రోజు విన్న ఆ పార్వతి మాటలు ఆ రోజు ఆమె భర్త అచ్చారావు కిచ్చిన సలహాలు విన్న సత్యవతిలో ఉద్రేకాన్ని కలిగిస్తున్నాయి.

ఎప్పుడూ మౌనంగా ఉండే భార్య ఈ రోజు ఇలా మాట్లాడేసరికి మొదట ఆశ్చర్యం, తరవాత కోపం కట్టలు తెంచుకుని వచ్చాయి భరత్‌కుమార్‌లో!



ఫోటో_ఎల్.ఆర్.గ్యోకర్

"నేను సంపాదించే డబ్బు పాపిష్ఠిదా? అలా అయితే నీవు తొడుక్కున్న డ్రస్సు ఎక్కడిది? నీవు తింటున్న తిండి ఆ పాపిష్ఠి డబ్బుతో కొన్నదే! ..."

"మీరు కోరే నాగరికత పేరుతో ఈ నవ్వుల పాలయ్యే విదేశీ బట్టలు తొడుగుతున్నాను గానీ, నాకు ఇష్టపడి కాదు. నిండుగా చీర కట్టుకున్న తృప్తి ఏ తెలుగింటి ఆడదానికీ ఈ బట్టల్లో రాదు. ఇక డబ్బు విషయం. మీరు సంపాదిస్తున్నది పాపిష్ఠి డబ్బు అవుతుంది గానీ నేను తింటుంది మాత్రం కాదు. నా తండ్రి కష్టపడి సంపాదించి ఆ డబ్బుతో మిమ్మల్ని చదివించారు. ఆయన కష్టంలో, సంపా దనలో పవిత్రత ఉంది. ఆ పవిత్రతకు ఫలితమే నేను తింటున్న తిండి. పదిమంది ఉసురు పోసుకుని సంపాదించిన సంపాదనతోగాని, ఆ పాపంతోగాని నా కెటువంటి సంబంధం లేదు." సత్యవతి ఉద్రే కంతో వూగిపోసాగింది.

నాటి వాల్మీకి పాపాలతో తన కెటువంటి సంబంధం లేదన్న భార్య తెగువ కనిపించింది సత్య వతిలో!

ఒక్క ఉదుటున పైకి లేచాడు భరత్‌కుమార్. న్యాయం నోరు మూస్తేగానీ అన్యాయం విలయ తాండవం చేయలేదు. అందుకే చెంప చెళ్ళుమని పించాడు. కళ్ళు తిరిగి నేలమీద పడి కుప్పలా కూలి పోయింది సత్యవతి.

● ● ● ●

కేసు ముగిసింది ...

ముందుగా వూహించిన న్యాయ నిర్ణయమే గనుక ఎవరూ ఆశ్చర్యపోలేదు. గొంతు చించుకుని అరవలేదు.

పార్వతి తల దించుకుని వడివడిగా అడుగులు వేస్తూ వెళ్ళిపోయింది.

భరత్‌కుమార్ నల్లజేబు డబుల్ ఫీజుతో నిండి పోయింది.

అచ్చారావు ఆఘమేఘాలమీద పరుగుతీశాడు, మరో మగువ జీవితాన్ని కబంధ హస్తంలోకి ఇరికించు కోవడానికి!

విజయగర్వంతో ఇంటికి చేరాడు భరత్‌కుమార్! తలుపు తెరుచుకుని లోపలికి వెళ్ళాడు. టేబుల్‌పై రెపరెపలాడుతున్న తెల్లకాగితం, దానిపై నల్లని అక్షరాలు వెక్కిరిస్తూ కనిపించాయి.

అనుమానంగా కాగితాన్ని చేతుల్లోకి తీసుకున్నాడు భరత్‌కుమార్.

"నల్ల ముసుగులో, నల్ల డబ్బుకోసం అన్యాయాన్ని రక్షించి, న్యాయాన్ని భక్షిస్తున్న న్యాయవాది భరత్ కుమార్ గారూ—మీలో అసలు మనిషిని... కాదు కాదు—రాక్షసుడ్ని ఇన్నాళ్ళకు చూడగలిగాను. పచ్చ నోట్లకోసం పచ్చని బ్రతుకులనుసైతం పీక్కు తినగలిగే నీలాంటి రాక్షసులు ఉన్నారని నిన్ననే తెలుసు కున్నాను. నేను మనిషిని. మనసున్న మనిషిని. కనుక రాక్షసుడితో కాపురం చేయలేను. ఎందుకంటే, పై ఇంటి పార్వతి ఎటువంటిదో తెలుసుకుని, ఒక్క రోజులో ఆమె నుండి సంతకం తీసుకుని అచ్చారావు నుండి విడదీసేశారు. విడదీయడానికే కంకణం కట్టు కున్న మీరు ఏనాడైనా నాలుగు క్షణాలు ఆలోచించి నాకూ విడాకు లివ్వరని నమ్మక మేమిటి? అందుకే అచ్చారావులా నా తండ్రి నా కిచ్చిన ఆస్తిని మీరు తీసుకుని, అలవాటైన పనిని మీరు సునాయాసంగా చేసేవరకూ చేతులు ముడుచుకుని కూర్చుని పార్వతిలా బ్రతుకు ఎడారిమయం చేసుకోలేను. అందుకే మీ నుండి విడిపోదలచుకున్నాను. రెండు రోజుల్లో మీకు అందబోయే లాయర్ నోటీసు పట్టుకుని కోర్టులో కలవండి. ఇది అన్యాయ మని మీరు అరచినా కోర్టులోనే...మా ఇంటికి మాత్రం రాకండి.

ఇట్లు,

—నిన్నటివరకూ అసత్యవంతుడి భార్య అయిన సత్యవతి. ●